మే - జూన్, 2012

# స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక



## దేనిని బట్టి నీ సంతోషం?



# "మనస్సులోని మాట"

క్రీస్తుయేసునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.

తండ్రియైన దేవుడు తన కుమారుని ద్వారా మనలను రక్షించుటకు ఆయనను ఈ లోకమునకు పంపియున్నాడు. యౌవ్వనస్థుల చదువలలో దేవుడు జ్ఞానం అనుగ్రహించి రాబోయే విద్యాసంవత్సరం ఆయన కృపతో నడిపించాలని ప్రార్థన చేద్దాం.

రాష్ట్రము అన్ని రంగములలో వెనకబడి పోతున్న సమయములలో సరియైన రీతిలో ముందుకు వెళ్ళేటట్లు మనం దేవుని సన్నిధిలో ప్రార్థన చేయవలయును. పేర్లు కూడా గుర్తుంచుకోలేనన్ని పథకములను ప్రభుత్వము ప్రకటించినప్పటికి, వాటి వలన ఎవరికి మేలు జరుగుతుందో తెలియని పరిస్థితి ఉంది. అవసరతలలో ఉన్నవారి కంటే కడుపు నిండిన వారే ప్రభుత్వ పథకముల ద్వారా ప్రజాధనాన్ని కొల్లగొట్టుచున్నారు. వేల కోట్ల రూపాయలు అక్రమార్కుల జేబులలోకి వెళ్ళిపోతున్నాయి. వీటన్నింటి నిమిత్తము భారంగా ప్రార్థన చేయవలసిన బాధ్యత క్రైస్తవులుగా మనకు ఎంతో ఉంది. నిజక్రైస్తవుడు తన పరిసరాలను, దేశమును ఎల్లప్పుడూ తన ప్రార్థనలతో కాపాడుకుంటాడు.

క్రీస్తుని విశ్వసించిన మనము పరిస్థితులను చూచి కలవరపడక ప్రతి భారమును విడిచిపెట్టి, విశ్వాసమునకు కర్తయైన యేసువైపు చూచుచూ ఈ పరుగు పందెములో ఓపికతో పరిగెత్తుదము. విశ్వాస జీవితం ఓ పరుగు పందెం లాంటిది అని పౌలు అనేక సందర్భములలో ప్రకటించడం జరిగింది. చివరి శ్వాస వరకు పరుగుపందెములో ఓర్పుతో పరిగెత్తాలని, బహుమానం పొందేటట్లు పరిగెత్తాలని మనలను హెచ్చరించుచున్నాడు. జీవితములో అనేక ఇబ్బందులు, ఆటంకములు ఎదుర్కోవచ్చు, వాటన్నిటిని నిర్లక్ష్యపెట్టి ముందుకు కొనసాగాలి. దేవుడు పరిచర్యను ముందుకి తీసుకొని వెళ్ళుచున్న విధానం చూచినప్పుడు దేవునిని ఎంత స్తుతించిననూ ఋణస్తులమే. అనేకులు దేవునికి చెల్లించుచున్న కృతజ్ఞతాస్తుతుల మూలముగా ఈ పరిచర్య విస్తరించుచున్నది అని పౌలు (2 కొరింథీ9:12) చెప్పినట్లు మనమందరము కృతజ్ఞతాస్తుతులు ఎల్లప్పుడూ చెల్లించవలయును. తద్వారా దేవుడు అనేక ఆత్మలను రక్షణ మార్గములో నడిపించడానికి మరియు రక్షించబడిన వారు ఆత్మలో బలపరచబడునట్లుగా సహాయం చేస్తారు.

అట్టి ధన్యత దేవుడు అనుగ్రహించును గాక !

మీ సహోదరుడు.....



మే - జూన్, 2012

# స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక

## ఈ సంచికలో...


- దేనిని బట్టి సంతోషం? ..... 2
- అమోలాంగా గౌతమోలా ..... 5
- సంఘము కొరకై (స్త్రీల ప్రత్యేకం) ..... 7
- సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర -22వ భాగము ..... 10
- సినిమా (బాలల శీర్షిక) ..... 12
- నా జీవితంలో చేసిన మేలులు (సాక్ష్యము) ..... 15
- మానసిక భావోద్రేకపరమైన స్వస్థతలు ..... 17
- ప్రార్థన ఊపిరి పీల్చుట వంటిదే ..... 19
- కీషోను నది ..... 21
- బైబిల్ క్విజ్-22 ..... 22
- జన్మదిన శుభాకాంక్షలు ..... 23


మా చిరునామా: ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని, వనస్థలిపురం,
హైదరాబాద్-500 070, ఫోన్: 040-2420 2227

# దేనిని బట్టి సంతోషం ?



"యెహోవాను బట్టి సంతోషించుము ఆయన
నీ హృదయవాంఛలను తీర్చును" - కీర్తన 37:4

మనుష్యులు దేనిని బట్టి సంతోషించుచున్నారు అని మనము గమనిస్తే, మానవుని, అతని కొరకు సమస్తమును సృష్టించిన సృష్టికర్తయైన దేవుని విడిచిపెట్టి బంగారము, వెండి, దాసదాసీలు, భూములు చూచుకొని సంతోషించుట అధికమైపోయింది. మనము ఎక్కడికి వెళ్ళినా, ఎంత సంపాదించారు? ఇల్లు కట్టుకున్నారా? కారు కొన్నారా? కనీసం ప్లాట్ అయినా కొనుక్కున్నారా? అన్న ప్రశ్నలు తప్ప మరేమీ వినిపించట్లేదు. చివరికి బోధకులైన వారు సహితము, నేను ఇంత పెద్ద మందిరము కట్టాను, దానిని ఎంతో సుందరంగా తీర్చిదిద్దాను, ఇన్ని వందల మంది లేక వేల మంది నా దగ్గరికి వస్తారు అని బహుగా సంతోషించడం ఈ దినములలో మనం చూస్తున్నాము. మానవ జీవితంలో అతి ముఖ్యమైన శాంతి, సమాధానము మరియు పరలోకరాజ్యమును గూర్చిన మాటలు నేటి దినములలో ప్రాధాన్యత లేనివిగా అనేకులు భావిస్తున్నారు. కానీ క్రీస్తుని అంగీకరించిన వారికి దేవుడు అనుగ్రహించిన వాగ్దానమును మనము గమనిస్తే, " మన హృదయవాంఛలు తీర్చబడాలంటే దేవుని యందే సంతోషించాలి" అలా కాక దేని యందు సంతోషించినను, అది నిజమైన సంతోషం కాదు, మన జీవితమునకు తృప్తిని ఇవ్వలేదు. అంత మాత్రమే కాక, తీవ్రమైన నిరాశను, కొన్నిసార్లు జీవితము మీద విరక్తిని కూడా కలిగిస్తుంది.

**దేవుని యందు ఏ విధంగా సంతోషించాలో మనము తెలుసుకుందాము :-**

**<u>1. దేవుడు అనుగ్రహించిన రక్షణను బట్టి సంతోషించుట :-</u>**

రక్షణ అనగా మానవుని జీవితములోని జన్మ, కర్మ, పాపముల నుండి క్షమింపబడి, తద్వారా నిత్య అగ్నిగుండము నుండి రక్షింపబడుట. మన పాపములను హృదయ పూర్వకంగా ఒప్పుకొని, పాపక్షమాపణ నిశ్చయత పొంది, బాప్తిస్మం తీసికొనుట ద్వారా రక్షణ కార్యం సంపూర్ణమవుతుంది. కేవలం బాప్తిస్మం మాత్రమే రక్షణ కాదు. ఇది ఒక మహత్తర కార్యము, యేసుక్రీస్తు వలన మాత్రమే మానవాళికి ఇవ్వబడిన అమూల్యమైన కానుక. దీనిని బట్టి ఎంత సంతోషించినను మన జీవితంలో తరిగిపోనిది. అందుకే అపోస్తలుడైన పేతురు తన మొదటి పత్రికలో చెప్పనశక్యమును, మహిమాయుక్తమునైన సంతోషము గలవారై ఆనందించుచున్నారు అని రక్షణను గూర్చి వ్రాయుట జరిగింది. రక్షణ ఆనందము గురించి

ఎంత చెప్పుకొన్నప్పటికి వర్ణించడం వీలుకానిది. జీవితంలో ఆ ఆనందము వివరించడానికి మానవ జ్ఞానము సరిపోదు, కనుక రక్షణను బట్టి మనము ఎల్లప్పుడూ ఆనందించే వారిగా ఉండాలి. **కీర్తన 35:9, హబక్కూకు 3:18,** వచనములలో రక్షణను బట్టి సంతోషించడం కనబడుచున్నది. హబక్కూకు గ్రంథములో ఈలాగు వ్రాయబడింది. అంజూరపు చెట్లు పూయకుండినను, ద్రాక్ష చెట్లు ఫలింపకపోయినను, ఒలీవ చెట్లు కాపులేక యుండినను, సాలలో పశువులు లేకపోయినను, ఎముకలు క్రుళ్ళిపోవుచున్నను అతని రక్షణానందమును ఏదీ పాడు చేయలేకపోయినది. ఎంత ఆశ్చర్యం, మన జీవితంలో రక్షణను గూర్చిన ఆనందం ఇంత బలమైనదిగాను లేక స్థిరమైనదిగాను ఉన్నదా? నిజక్రైస్తవుడు తప్పక ప్రతి దినమూ తన రక్షణను బట్టి సంతోషించ వలసిన అవసరం ఎంతైనా ఉంది. ఎందుకనగా రక్షణను బట్టి సంతోషించలేని వాడు క్రీస్తుని అంగీకరించడంలో అర్థం లేదు. దేవుని యొద్ద నుండి ఎన్ని స్వస్థతలు, ఆశీర్వాదములు పొందినప్పటికి, అన్నింటికన్నా మొదటి స్థానంలో ఉండే అద్భుతం రక్షణ మాత్రమే. అందుకే రక్షణను బట్టి సంతోషించాలి.

## 2. ఆయన బలమును బట్టి సంతోషించుట :-

**యెహోవా, రాజు నీ బలమును బట్టి సంతోషించుచున్నాడు, నీ రక్షణను బట్టి హర్షించుచున్నాడు. - కీర్తన 21:1**

దావీదు రాజై యుండి కూడా తన బలమును బట్టి కాక, దేవుని బలమును బట్టి సంతోషించుచున్నాడు. సామాన్యమైన మానవులు సహితము ఈ దినములలో వివాహముల లోనూ, ఆయా సమయములలోనూ, బంధుమిత్రులను ఆహ్వానించి, తమ స్థితిని లేక తమ బలమును వారికి కనపరచాలని, దానిని బట్టి సంతోషించాలని చూస్తూ ఉంటారు. ఒకరోజు వెనుక శత్రువులు, ముందు సముద్రము ప్రజలు ఏమి చేయాలో పాలుపోని పరిస్థితి. కానీ మన దేవుడు తన బాహుబలము చేత సముద్రమును పాయలుగా చేసి తన ప్రజలను కాపాడుట మాత్రమే కాక, శత్రువులను ఆ సముద్రములో ముంచి వేసినవాడు. ఆయన బలమునకు విరోధమైన రాజులు, రాజ్యములు, దేవుడు లేక దేవతలు అనబడినవారు నిలవబడడం అసంభవం. కారణం ఆయన సర్వశక్తి కలిగిన వాడు. ఆయన బలము గూర్చి ఆలోచిస్తే, మానవుని జీవితంలోని ప్రతి క్లిష్ఠ పరిస్థితులను సరి చేయగలవాడు. ఈ భూమి మీద



ఉన్న ఏ సమస్య అయినా పరిష్కరించడం ఆయనకి సాధ్యమే. యుద్ధములో అవసరతని బట్టి ఒక దినమంతా సూర్య, చంద్రులను ఆపినవాడు, ఈ సర్వ సృష్ఠిపై అధికారం కలిగి

ఉన్నవాడు అందుకే ఆయన బలమును బట్టి ఎంతగానో సంతోషించవలసిన వారమై యున్నాము.

### 3. దేవుని నిమిత్తం హింసను బట్టి సంతోషించుట :-

**నూతన నిబంధనా గ్రంథంలో "నా నిమిత్తము జనులు మిమ్మును నిందించి హింసించి మీ మీద అబద్ధముగా చెడ్డ మాటలెల్ల పలుకునప్పుడు మీరు ధన్యులు. సంతోషించి, ఆనందించుడి, పరలోకమందు మీ ఫలము అధికమగును" - మత్తయి 5:11,12.**

ఒకరోజు స్తెఫను అనే పరిచారకుడు క్రీస్తుని గురించి తెలియని ప్రజలకు తెలియపరుస్తూ ఉండగా, రాళ్ళతో కొట్టి చంపడం జరిగింది. రాళ్ళ దెబ్బలు తింటూ,



మరణిస్తున్న సమయంలో ఆకాశం తెరవబడి, దేవుడు తన కొరకు లేచి నిలవబడడం చూచి, ఎంతగానో సంతోషిస్తున్నాడు. అందుకే రాళ్ళతో కొట్టిన వారిని క్షమించమని ప్రార్థన చేసాడు. దేవుని యెడల మన ప్రేమ, ఇలాంటి సమయముల లోనే వెల్లడి అవుతుంది. ఏ మార్గముల లోనూ కనిపించని ఒక విషయం యేసు క్రీస్తు మార్గములో కనబడుతుంది. అదే నిందలలో, హింసలలో చెడ్డ మాటలు మన యెడల పలుకుతున్నప్పుడు సంతోషించడం. అందుకే మన పితరులను అగ్నిగుండములో, సింహాల బోనులో వేసినా వారిలో ఆనంద సంతోషాలే వ్యక్తమయ్యాయి. కొరడాలతో కొట్టినా, రాళ్ళతో హింసించినా వాటిని బట్టి కూడా సంతోషించినట్లు బైబిల్ గ్రంథంలో మనం చూడగలుగుతాము.

ప్రియ సహోదరి, సహోదరులారా! మీ హృదయవాంఛలు తీర్చబడుచున్నాయా ? కోరికలు నెరవేరడం కోసం మనుష్యులు ఆపదమ్రొక్కులు మ్రొక్కుకుంటూ, గురూజీలను ఆశ్రయిస్తూ, తీర్థయాత్రలు చేయుచూ, పుణ్యకార్యములు జరిగిస్తూ, తీవ్రంగా శ్రమిస్తూ ఉంటారు. కానీ కోరినది సిద్ధించుటకు ప్రభువు, ఆయనను విశ్వసించిన వారికి నిర్ణయించిన ఒక మార్గము దేవునిని బట్టి సంతోషించడం. **కనుక ఆయన రక్షణను బట్టి, ఆయన బలమును బట్టి, ఆయన నిమిత్తం హింసించ బడుటను బట్టి సంతోషించవలసిన వారమై యున్నాము.** అప్పుడు మన హృదయవాంఛలు తీర్చబడతాయి.

అట్టి ధన్యత దేవుడు మీకు దయచేయును గాక!

# అమోలాంగా గౌతమోలా

కొన్ని సంవత్సరముల క్రితం అమోలాంగా స్థలం ఒక ప్రమాదకరమైన చీకటి స్థలం. బీదరికం, హింస, అజ్ఞానం, మత్తు పానీయాలు అక్కడి ముఖ్య సమస్య. ఒకవేళ మనం గనుక కొన్ని సంవత్సరముల క్రితం అమోలాంగా స్థలమును దర్శిస్తే ఉదయం 7 గంటలకే ప్రజలు బాగా తాగి వీధుల మీద పడియుండటం చూస్తాం. మాకు అనేక జైళ్ళను కట్టారు కాని అవి ప్రజలతో పూర్తిగా నిండిపోయేవి. గృహ హింస మరింత దారుణంగా ఉండేది. మత్తు పానీయాలకు బానిసలైన పురుషులు ఇండ్ల వద్ద ఉన్న స్త్రీలను వేధించేవారు.

ఆ గ్రామములో ప్రభువు చేత ఉజ్జీవంలో వాడబడిన మరియానో అనే వ్యక్తి తన చిన్నతనంలో జరిగిన సంఘటనను ఇలా గుర్తు చేసుకొన్నాడు. "నేను మిస్సోరిలో పెరిగాను. నా తండ్రి 40 నుండి 50 దినముల వరకు ఏకధాటిగా త్రాగేవాడు. మాకు ఎన్నడు మంచి ఆహారం లేకుండేది. నా తల్లిదండ్రులకు ఉన్న కొంచెం డబ్బును త్రాగాడానికే ఖర్చు చేసేవారు". ఈ గ్రామ ప్రజలకు మిస్సిమో దేవత చాలా ప్రాముఖ్యం. ఆ దేవత పట్ల భక్తిగా ఉండే విషయంలో వారు రాజీపడరు. ఆ సమాజమును ప్రభావితం చేసేది ఒక బలమైన దుర్గం. ఇలాంటి చీకటి రోజులలో ప్రజలు దేవుని వాక్యమును పట్టించుకోలేదు. బయటి నుండి వచ్చే సువార్తికులను ప్రజలు రాళ్ళతో, కట్టెలతో తరిమేవారు. కాని స్థానికంగా ఉన్న చిన్న గృహ సంఘాలు కూడా ఆగిపోయాయి. అక్కడ నిజమైన క్రైస్తవులు తిరస్కరించబడిన ఒక మైనారిటి వర్గం. ఒక సందర్భంలో మరియానో చుట్టు 6 వ్యక్తులు గుమికూడి అతని గొంతు మీద తుపాకి పెట్టారు. వారు తుపాకిని నొక్కినప్పుడు ఏమి కాలేదు. అతనిని బెదిరించినప్పుడు అతడు మాత్రం ప్రభువుకు ప్రార్థించాడు.

మరణం నుండి తప్పించబడిన పాస్టరు మరియానో గారు తన చిన్న సంఘమును ప్రార్థనకు ఆహ్వానించాడు. అది హింస, మంత్రాలు, బీదరికమనే దుర్గమును కూలగొట్టే సమయం. విజ్ఞాపన కర్తలు పరలోకం వైపు తమ విజ్ఞాపనలతో మొరపెట్టినప్పుడు వారు అసాధారణ విశ్వాసంతో నిండారు. వారు వారంలో 3 నుండి 4 రోజులలో ఉపవాస ప్రార్థన చేశారు. ప్రతి శనివారం నాడు వారు ప్రార్థన జాగరణ చేపట్టారు. అదే ద్వారాలను తెరిచింది. ప్రజలు సహవాసమునకు వచ్చి రక్షించబడటం మొదలైంది. అద్భుతములు, సూచక క్రియల

ద్వారా అనేక రీతుల్లో ప్రభువు విడుదలను ప్రజలను చూశారు. సంఘాలు పెరగడం మొదలైంది. నిజంగా మారిన జీవితముల సాక్ష్యములను విని వందల కొద్ది ప్రజలు తమ జీవితములను ప్రభువుకు సమర్పించారు. ప్రజలు మారిన జీవితములను చూశారు గనుక వారు సువార్తకు స్పందించారు. 10 మంది ప్రజలలో 8 మంది తిరిగి జన్మించిన క్రైస్తవులే. ఆత్మీయ పరివర్తన మాత్రమే కాకుండా సామాజిక పరివర్తన కూడా జరిగింది. ఒకప్పుడు అమోలాంగా స్థలం 36 బార్లతో నిండింది. కాని ఇప్పుడు అది 3కు చేరింది. అక్కడ మత్తు పానీయాలను త్రాగడం ఆగింది గనుక హింస కూడా ఆగింది. 20 సంవత్సరాల నుండి పట్టణములో నేరం శాతం స్థిరంగా తగ్గుముఖం పట్టింది. 1994 లో అమోలాంగాలోని నాలుగు జైళ్ళు మూయబడ్డాయి. ఆధునీకరించిన జైలు బిల్డింగును ఇప్పుడు "హాల్ ఆఫ్ హానర్‌గా" పిలుస్తున్నారు. అవినీతి, ఇబ్బందులు తగ్గాయి గనుక జైళ్ళ అవసరం లేదని పోలీసు ప్రధానాధికారే స్వయంగా ఒప్పుకొన్నాడు. దేశం మరియు వ్యవసాయం యొక్క పరివర్తనను ప్రజలు కూడా చూశారు. అక్కడ చాలా కూరగాయలు పండుతున్నాయి. గతకాలంలో 4 ట్రక్కుల కూరగాయలను ప్రతి నెల ఎగుమతి చేసేవారు. కాని ఇప్పుడు ప్రతి వారమునకు 40 ట్రక్కుల కూరగాయలు ఎగుమతి అవుతున్నాయి. ఉత్పత్తిలో 1000 శాతం పెరుగుదల ఉంది. విగ్రహారాధన, మంత్రాల అభ్యాసం పారిపోయింది. పట్టణం మరియు ప్రపంచ విస్తరణ కోసం తిరిగి జన్మించిన మేయరు 15000 మంది విశ్వాసులతో ఒక ప్రార్థన సమావేశమును ఏర్పాటు చేశాడు.

ఇది నిజమా లేక ఇది జరుగుతుందా అని కూర్చుని ఆలోచించడం ఎందుకు? దేవుడు ఉజ్జీవమును ఇచ్చే దేవుడు, మనం ఏది చేసినా కూడా దేవుడు కదలడం మనం చూడకపోవచ్చు కాని మనం ప్రార్థించినప్పుడు దేవుని సమాచారమును మాత్రం మనం ఆపలేము. బలంగా కదలాలని దేవుడు ఆశిస్తున్నాడు. దేవుడు తన పరిశుద్ధాత్మను కుమ్మరించేంత వరకు పట్టుదలతో కూడిన ప్రార్థనకు నిన్ను నీవు సమర్పించుకొంటావా?



# సంఘము కొరకై

- సిస్టర్ విజయ

**క్రీస్తు సంఘమును ప్రేమించి మరియు దాని కొరకు తన్ను తాను అప్పగించుకొనెను. (ఎఫెసీ 5:25)**

సంఘమును కట్టుటకు, యేసు సంఘమును ఏ విధంగా ప్రేమించారో అదే విధంగా మనము ప్రేమించవలసియున్నది. మన డబ్బును లేక సమయమును ఇచ్చినచో సరిపోదు కానీ సంఘము కొరకు మనలను మనమే ఇచ్చుకొనవలెను. అనేకమైన వాటిని త్యాగం చేసేవారిగా ఉండాలి.

మానవులమైన మన యెడల దేవుని ప్రేమను వివరించాలంటే ఆయన పరలోకములో హాయిగా కూర్చొని క్రీస్తు ప్రేమ సందేశములు పంపుతూ క్రియ చేయకుండా లేరు కాని మన కొరకు ఈ లోకమునకు వచ్చి తనని తాను అర్పించుకున్నారు. సంఘమును సంరక్షించి పోషించుచున్నారు. భూమి మీద ఒక ఉదాహరణను చూచినట్లైతే స్త్రీ తన గర్భమున పుట్టిన బిడ్డను కరుణింపకుండ తన చంటి పిల్లను మరచునా? (యెషయా 49:15) అని బైబిల్ గ్రంథములో చెప్పబడినట్లుగా ఒక తల్లిని మనం గమనించినట్లైతే, చంటి బిడ్డ యెడల తల్లిప్రేమ పూర్తిగా త్యాగముతో నిండియుండును. ఉదయము మొదలుకొని రాత్రి వరకును మరియు రాత్రి అంతా తల్లి బిడ్డ కొరకు త్యాగములు, త్యాగములు మరియు త్యాగములు చేయుచుండును. ఈ త్యాగమునకు బదులు తిరిగి ఆమె ఏదియు కోరుకోదు, ఎటువంటి ప్రతిఫలమును కోరుకొనక సంవత్సరము తరువాత సంవత్సరము సంతోషముతో ఆ బిడ్డ కొరకు బాధను మరియు ఇబ్బందులను భరించును. దేవుడు కూడా అదే విధంగా మనలను ప్రేమించుచున్నారు మరియు అదే స్వభావమును మనలో కలుగజేయవలెనని ఆయన కోరుచున్నాడు. దైవికమైన ప్రేమను పొందుటయే గురిగా మనము ప్రయత్నించవలెను.

ఒక తల్లి తన చుట్టు ప్రక్కల ఉన్నవారు తమ బిడ్డలకు ఏదైనా త్యాగము చేయుచున్నారా లేదా అనేది ఆమె లెక్కచేయదు. తనంతట తానే సంతోషముగా అంతయూ త్యాగము చేయును. అదే విధముగా సంఘమును తన స్వంత బిడ్డగా చూచిన వ్యక్తి, తన చుట్టు ప్రక్కల ఉన్నవారు సంఘమునకు త్యాగము చేయుచున్నారా, లేదా అని పట్టించుకోరు కానీ తనకు తానుగా సంతోషముగా త్యాగము చేయును. అంతేకాక అలాంటి వారికి ఎవరి మీదా కంప్లైంట్ చేయాలనే కోరిక కూడా ఉండదు. సంఘమునకు వేరే వాళ్ళు త్యాగము చేయుట లేదు అని కంప్లైంట్ చేసేవారు తల్లులు కాదు కాని జీతమునకు పనిచేయు

నర్సులవలె ఉందురు. అటువంటి నర్సులు 8 గంటలు పనిచేసిన తరువాత, తరువాత షిఫ్ట్ (8 గంటలు) పనిచేయు నర్సు సమయమునకు రానియెడల కంప్లైంట్ చేసెదరు. కాని ఒక తల్లి ప్రతిరోజు 8 గంటలు మాత్రమే పనిచేయదు. ఆమె ప్రతిరోజు 24 గంటలు పనిచేయును, ఆ విధముగా అనేక సంవత్సరములు పనిచేయును. అయినను దానికి ప్రతిఫలముగా ఏమీ పొందదు మరియు పొందాలనే తలంపు కూడా ఉండదు. బిడ్డకు 20 సం॥లు వచ్చిననూ, ఆమె పని పూర్తి అవ్వదు.

ఒక తల్లి తన బిడ్డల నుండి జీతము కోరదు, తల్లి చేసిన సేవకు ఏ బిడ్డ కూడా జీతము ఇవ్వదు. నిజానికి నర్సుల వలె తల్లికి గంటకు 20 రూపాయిల చొప్పున లెక్కించినచో, బిడ్డకు 20 సంవత్సరముల వయస్సు వచ్చినప్పటికి ప్రతి బిడ్డ తల్లికి 30 లక్షల రూపాయిలు చల్లించవలసియుండును. ఏ బిడ్డయైనా తల్లికి అంత సొమ్ము చెల్లించగలడా ?

ఇప్పుడు ప్రశ్న ఏమనగా దినము తరువాత దినము, సంవత్సరము తరువాత సంవత్సరము యేసుప్రభువు మరలా వచ్చు పర్యంతము జీతము తీసికొనకుండా తనను తానే ఇచ్చుకొనుచూ ప్రభువు కొరకు మరియు ఆయన సంఘము కొరకు పని (పరిచర్య) చేయు వారెవరైనా ఉన్నారా ? త్యాగము చేసే ఆత్మ లేకుండా ప్రభువును సేవించుటకు ప్రయత్నించే 10,000 మంది సగము హృదయముతో ఉన్న విశ్వాసుల కంటే, త్యాగము చేయుటకు సిద్ధముగా ఉన్న ఒక్క వ్యక్తిని దేవుడు ఎక్కడైననూ కనుగొనినచో, ఆయన సంఘమును కట్టుటకు ఆ వ్యక్తిని దేవుడు వాడుకొనును.

బైబిలు గ్రంథములోని లేఖనములను పరిశీలించినప్పుడు ఇట్టి త్యాగముతో కూడిన హృదయముతో దేవుని పరిచర్య చేసిన అకుల, ప్రిస్కిల్ల అను వారిని కనుగొనవచ్చును. వీరు ఇటలీ నుండి క్రొత్తగా కొరింథునకు వెళ్ళినవారు. వృత్తికి డేరాలు కుట్టేవారు. పౌలు అదే వృత్తి గలవాడు గనుక వారితో కాపురము ఉండెను. వారు కలిసి పనిచేయుచుండిరి. వీరు అనేకులను తమ ఇంట చేర్చుకొని, దేవుని మార్గములను వివరించుచూ, దేవుని కొరకు జీవించే విధముగా ప్రోత్సాహపరచుచూ, సంఘం కొరకు ప్రయాసపడునట్లుగా సిద్ధపరిచేవారు. వీరిని గురించి అపో.పౌలు క్రీస్తుయేసు నందు నా జతపనివారైన ప్రిస్కిల్లకు, అకులకును నా వందనములు చెప్పుడి, వారు నా ప్రాణము కొరకు తమ ప్రాణములను ఇచ్చుటకైనను తెగించిరి. మరియు వారి ఇంట ఉన్న సంఘమునకును వందనములు చెప్పుడి (రోమా 16:3,4) అని సాక్ష్యమిచ్చుచున్నాడు. ఈ సాక్ష్యమును బట్టి అకుల, ప్రిస్కిల్ల అను వీరు కుటుంబముగా ఎంత త్యాగ సహితముగా తమ్మును తాము అర్పించుకొని, సంఘమును కట్టడానికి ఆ దినములలో ప్రయాసపడ్డారో అర్థమవుతుంది.

ప్రియ సహోదరీ! అకుల, ప్రిస్కిల్ల అను వారి జీవితములను ధ్యానించినప్పుడు, వారు డేరాలు కుట్టుట అనే అతిసామాన్యమైన వృత్తిలో ఉన్నప్పటికి చింతించిన వారు కారు. వారు ఉన్న స్థితిలో సంతృప్తి కలిగి జీవిస్తున్నారని మనకి అర్థం అవుతుంది. ఎంతో సమర్పణతో సేవ చేస్తున్న మరియు యేసుక్రీస్తు తరువాత అంతటి శ్రమలు పొందిన అపోస్తలుడిగా పేరు గాంచిన పౌలు నా జతపనివారు అని వీరిని గూర్చి సాక్షమివ్వడం చూస్తుంటే వీరు దేవుని పరిచర్యలో ఎంత ప్రయాసపడ్డారో మనకి అర్థమవుతుంది. పుట్టుకతోనే ఇలాంటి త్యాగపూరితమైన మనసుతో పుట్టేవారు ఎవరూ ఉండరు కానీ, జీవితములో వాక్యమును బట్టి పురికొల్పబడుట, భక్తుల జీవితముల ద్వారా ప్రేరేపించబడి త్యాగసహితమైన జీవితం జీవించడం జరుగుతుంది.


కనుక మన జీవితములలో దేవుని కొరకు జీవించవలసిన సమయములు వచ్చినప్పుడు ఏవేవో సాకులు చెబుతూ మనలను మనం సమర్థించుకుంటూ, దేవుని పక్ష ముగా నిలిచే అవకాశమును పోగొట్టుకొనవద్దు. అకుల, ప్రిస్కిల్ల అను వారి చిన్న కుటుంబములో వారికి వచ్చిన అవకాశమును దేవుని కొరకు జీవించి, మన అందరికి ప్రోత్సాహకరంగా ఉన్నారు. మన జీవితములో కూడా అట్టి ధన్యతను దేవుడు కలుగజేయును గాక!

## ముఖ్య గమనిక:

మీ ప్రార్థనావసరతలకై **ఎపఫ్రా మినిస్ట్రీస్** ఆఫీసు నందు
సోమవారం నుండి శనివారం వరకు
ఉదయం 10.30 గం॥ల నుండి సాయంత్రం 6.30 గం॥ల
వరకు సంప్రదించగలరు.

**ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,**
**వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070**
Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com

**ఎపఫ్రా మినిస్ట్రీస్ పాటలు మరియు ప్రసంగముల సి.డి.లు**
**కావలసినవారు మమ్ములను సంప్రదించగలరు.**



# సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర

**- సీరియల్ 22వ భాగము**

ఒకానొక దినమున ఈ విషయమంతటిని గూర్చి ఆయన మనస్సులోను, హృదయంలోను ఎంతో భారం కలగడం వలన ఒంటరిగా వెళ్ళిపోయి ఒక చెట్టు క్రింద కూర్చొని ప్రార్థించ నారంభించాడు సుందర్. అయితే తనపై శత్రుత్వం చూపిన విద్యార్థి ఇదంతా గమనించి తన వెనుకే వచ్చి చెట్టు చాటున దాక్కున్నాడన్న సంగతి సుందర్‌కు తెలియలేదు. సుందర్ అయితే దీనంతటికి తానే కారణమేమో తెలియజేయమనీ, పొరబాటున తానేదైనా తప్పు చేసుంటే క్షమించమనీ ప్రభువుకు ప్రార్థించాడు. మరి ముఖ్యంగా తనను దూషించిన విద్యార్థి కొరకు ప్రత్యేకంగా ప్రార్థించాడు. అతనిని దీవించమని తామిరువురి మధ్య ప్రేమానురాగములు నెలకొల్పమని దేవునిని ఎంతగానో బ్రతిమాలినాడు. చెట్టుచాటున ఉండి ఈ ప్రార్థనంతా జాగ్రత్తగా వింటూ ఉన్నాడా విద్యార్థి. సుందర్ ప్రార్థనకు వెంటనే జవాబు వచ్చింది. పొంచియున్న ఆ విద్యార్థి సుందర్ చేసిన ప్రార్థన విని చలించిపోయి ముందుకు వచ్చి సుందర్ ప్రక్కనే మోకరించి క్షమించమని కోరాడు. వారిద్దరూ మంచి స్నేహితులైపోయారు. అనేక సంవత్సరముల తరువాత ఆసక్తి గల క్రైస్తవ సంఘ పరిచారకుడైన ఈ విద్యార్థి తన కొరకు సుందర్ ఆ చెట్టు క్రింద ప్రార్థన చేయడం విన్నప్పుడే క్రీస్తు వైపు తిరిగానని చెప్పాడు.

ఆ సమయములో స్టోక్స్‌గారు సెయింట్ ఫ్రాన్సిస్ వలే గాక, సహోదరత్వము అనే మరో పద్ధతిలో పరిచర్య చేయడానికి ముగ్గురు యౌవనులతో భారతదేశమునకు తిరిగి వచ్చాడు. కాంటర్బరీలోని ఆర్చి బిషప్‌గారి దగ్గర ముందుగానే అనుమతి తీసికొని లాహోర్‌లోని కెథడ్రల్‌లో ప్రారంభోత్సవ కూటమును జరిపారు. ఈ సంస్థలో ఐదుగురు సభ్యులుండగా వారిలో సుందర్ ఒక్కడే భారతీయుడు. కాని మిగిలిన వారి వలె ఆ సభలో అతడు ఎలాంటి ప్రమాణాలను చేయలేదు, లోకమును పరిత్యజిస్తానని, సువార్త ప్రకటించడానికి తనను తాను సమర్పించుకుంటానని అంతకు మునుపే దేవుని దగ్గర తాను ప్రమాణం చేశాడు.

వేదాంత కళాశాలలో విద్యార్థిగా చేరిన తరువాత సంఘకాపరిగా అభిషేకం పొందితే ఆంగ్లికన్ సంఘములలో మాత్రమే తాను ప్రసంగించవలసి ఉంటుందని

తెలిసికొన్న సుందర్ ఆశ్చర్యపడిపోయాడు. వేదాంత కళాశాలలోని వేదాంత విద్య, సంఘ చరిత్ర, ప్రార్థనా పుస్తకము, విభిన్న మతాల చరిత్ర మొదలగు వాటికి వెంటనే స్వస్తి చెప్పాడు. వేరే సంఘములలో ప్రసంగించకూడదనే నియమము తనపై ఎలాంటి ప్రభావమును చూపకూడదు. అయితే ప్రసంగములు చేయడానికి అంతకు ముందే తాను అనుమతి పొందాడు గనుక ఎన్నో గ్రామములలో సువార్త లేకున్నప్పుడు కేవలం ఆంగ్లికన్ సంఘములలో మాత్రమే సువార్తను ప్రకటించాలనే వాదనతో సుందర్ ఏకీభవించలేకపోయాడు. ఈ విషయములో ఆతృత చెందకుండా ఎంతగానో ఆలోచించి ప్రార్థన చేసి దేవుడు తన కొరకు ఏర్పాటు చేసిన మార్గం ఇది కాదని నిర్దుష్టమైన నిర్ణయమునకు వచ్చాడు. యేసుప్రభువును ప్రేమించే వారు ఏ తెగవారైనా, ఏ మతం వారైనా వారితో సహవాసం కలిగియుండడానికి తనకు పూర్తి స్వాతంత్ర్యముండాలని భావించాడు సుందర్. కాబట్టి లెఫ్రాంకు గారి దగ్గరకు వెళ్ళి, తన పరిస్థితిని వివరించి ప్రసంగాలు చేయడానికిచ్చిన అనుమతి పత్రమును తిరిగి ఇచ్చాడు. బిషప్‌గారు ఎంతో విశాల హృదయముతో సుందర్ చెప్పిన వివరణకు ఒప్పుకొని ఆ అనుమతి పత్రమును వెనుకకు తీసుకున్నారు. దీనితో ఒక సామాన్య క్రైస్తవ సాధువైన సుందర్ స్వేచ్ఛగా సువార్తను అందించాడానికి బయలుదేరాడు.

ఆ తరువాత ఆరు లేక ఏడు నెలలు ఉత్తర భారతదేశంలోని ఎన్నెన్నో గ్రామములకు, పట్టణములకు వెళ్ళి సువార్త ప్రకటించాడు. సంవత్సరమునకు ఒకసారి వికలాంగులైన బాలురకు ఏర్పాటు చేసే సహాయ కార్యక్రమములలో పాలుపొందేవాడు. ఎప్పుడైనా ఓ సారి ఢిల్లీ సిమ్లాలలో ఉన్న హాస్టళ్ళలో గాని, వేసవి విడిదీలలో గాని కొద్దిరోజులు గడుపుచుండేవాడు. కాని ప్రభువు తనకు అప్పగించిన సేవ నిమిత్తమై మరల తిరిగి వస్తుండేవాడు. కాషాయ వస్త్రములు ధరించి భుజమున గొంగళి వేసుకొని ప్రశాంతంగా తన దారిని పోతుండేవాడు సుందర్. అనుదినము వేకువనే లేచి ప్రార్థనలోను, ధ్యానములోను గడిపేవాడు. ఆ మైదాన ప్రాంతములలో ఎన్నెన్నో మైళ్ళు నడుస్తూ అవకాశం దొరికిన చోట సువార్త ప్రకటించడానికి ఆగేవాడు.

– సేకరించబడినది. –(ఇంకా వుంది)



# సినిమా

పిల్లలూ! బావున్నారా? ఎండలు బాగా ఉన్నాయి? హాలీడేస్ కదా అని ఎండల్లో తిరగకండి. ఉదయమూ, సాయంత్రమూ అవుట్ డోర్ గేమ్స్ ఆడుకోండి. ఈ హాలిడేస్‌లో రిలేషన్‌షిప్ పెంచుకోవడానికి మంచి అవకాశం ఉంటుంది. బంధువులతో, స్నేహితులతో "మంచి పిల్లలు" అన్పించుకుని యేసయ్యను మహిమ పరచాలి. **OK** నా!

రమేష్, కిషోర్ మంచి మిత్రులు. ఓరేయ్ కిషోర్ సినిమాకి వెళదామా అన్నాడు రమేష్. దాంతో కిషోర్ ఉలిక్కిపడ్డాడు. అప్పుడు రమేష్ అవున్రా శోభనా థియేటర్‌కి మంచి సినిమా వచ్చింది అని మురళీ చెప్పాడు. రాత్రికి మనం ఎలాగైనా వెళదాము అన్నాడు రమేష్.

"అలా కాదురా బాబు, ఇవాళ మా చర్చి మీటింగ్స్ ఉన్నాయి. దూరం నుండి సేవకులు వస్తున్నారని నిన్న చర్చిలో చెప్పారు. మా ఫ్యామిలీ అంతా కలసి ఆ మీటింగ్స్‌కి వెళ్ళాలనుకున్నాము అని చెప్పాడు కిషోర్. ఓస్ అంతేనా అంటూ హేళన చేశారు స్నేహితులు. అంతేకాదురా బాబు, టీ.విలో వచ్చే సినిమాలు కూడా చూడనివ్వరు మా ఇంట్లో అన్నాడు కిషోర్.

"ఏంట్రా నువ్వు చెప్పేది!! మీ ఇంట్లో ఎవరూ సినిమాలు చూడరా? నిజమేనంటావా!!!" అనడుగుతుంటే, కిషోర్ అడ్డంగా తలూపాడు. రమేష్ ఆశ్చర్యపోయాడు. కిషోర్ సినిమాలు చూడడన్న సంగతి ఇప్పటి వరకూ తెలియదు. అసలా విషయం కిషోర్ ఏనాడు చెప్పలేదు. చెబితే పిరికి వాడనుకుంటారని అతని భయం. "ఇంతకూ సినిమాలెందుకు చూడగూడదో చెప్పవా" అంటూ రమేష్ కుతూహలంగా అడిగాడు. "చెప్పడానికేముంది? సినిమాలు మనుష్యులను తప్పుదారిలో నడవడానికి ప్రోత్సహిస్తూ ఉంటాయి కదా అలాంటి వాటికోసం డబ్బులు ఖర్చు పెట్టడం కూడా వేస్ట్ అంటాడు మా డాడీ. రమేష్ పగలబడి నవ్వాడు. నవ్వు ఆపుకున్నాక, ఇంత చిన్న వయసులో అంత ఆలోచించవలసిన అవసరం ఏముంది? అందరూ చూడట్లేదా? మనం చూస్తే తప్పేంట? అని రమేష్ నచ్చజెప్పడానికి ప్రయత్నించాడు. అతనికేం జవాబివ్వాలో కిషోర్‌కి అర్థం

కాలేదు. "మరి మీటింగ్‌కి వెళ్ళాలి గదా" అంటూ తప్పుకోవాలనుకున్నాడు కిషోర్. ఒక్కరోజు వెళ్ళనంత మాత్రాన కొంపలేమీ మునిగిపోవు" అంటూ రమేష్ మరో మారు నచ్చజెప్పడానికి ప్రయత్నించాడు. "అవుననుకో, మా నాన్నగారు వదిలి పెట్టరుగా" నసిగాడు కిషోర్ "ఇలారా, నేను ఉపాయం చెబుతాను. మీ నాన్నగారి మాట ప్రకారం, ఆయన వెంట మీటింగ్‌కు వెళ్ళు, ప్రార్థన మొదలయ్యాక మెల్లగా బయటికొచ్చేయ్. పదిగంటల వరకూ ప్రార్థన జరుగుతూనే ఉంటుంది. ఆ లోపే వచ్చి మరల గుంపులో చేరిపోవచ్చు" అంటూ ప్లానంతా వివరించాడు. ఆ ప్లాను విన్నాక కిషోర్‌కు గుండె దడ దడ కొట్టుకోవడం మొదలయ్యింది.

పెద్ద మైదానంలో బహిరంగ సభ జరుగుతూ ఉంది. తప్పించుకొని బయటపడడానికి వీలుగానే ఉంది. అందరూ ప్రార్థనకు కళ్ళు మూసుకున్న సమయంలో కిషోర్ బయటకి వచ్చేశాడు. రమేష్‌ని కలుసుకొని ఇద్దరూ కలిసి సినిమాకి వెళ్ళారు. సినిమా అంతా కొట్లాటలు, డబల్ మీనింగ్ మాటలు, అసభ్యకరమైన డ్యాన్సులు. కిషోర్, తండ్రికి తెలియకుండా వచ్చినందుకు భయపడుతూ ఉన్నాడు. అతని మనసేమీ బాగోలేదు.

సినిమా అయిపోయింది. అందరూ ఎవరి ఇళ్ళకువాళ్ళు బయలుదేరారు. పిల్లలంతా సినిమాలో సీన్ల గురించి గోలగోలగా చెప్పుకుంటూ కేకలేసుకుంటున్నారు. కిషోర్ మాత్రం నీరసంగా నడుస్తున్నాడు. ఇంతలో అది చూచి మురళీ ఎగతాళిగా సినిమాలో హీరో రౌడీని ఎలా బాదాడో తెలుసా? అంటూ కిషోర్ డొక్కలో గుద్దాడు. కిషోర్‌కు కోపమొచ్చి, మురళీని బాదాడు. ఇద్దరూ ఒకరిమీద ఒకరు పడి చితక్కొట్టుకుంటున్నారు. దీన్ని చూస్తున్న పిల్లలు కేరింతలు కొడుతూ గట్టి గట్టిగా కేకలేస్తున్నారు.

ఆ వీధిలోని ఇండ్లలలోనుండి పెద్దవారు బయటికి వచ్చి పిల్లల్ని తిడుతున్నారు. ఇంతలో ఒక సబ్‌ఇన్‌స్పెక్టర్ మోటార్‌సైకిల్ మీద వచ్చి ఇద్దర్నీ చెరో దెబ్బ కొట్టి విడిపించి స్టేషన్‌కు లాక్కెళ్ళాడు. కానిస్టేబుల్ మీటింగ్ జరుగుతున్న మైదానం దగ్గరకొచ్చి, వేదిక మీదనుండి ప్రకటన చేయించి కిషోర్ తండ్రిని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్ళాడు. స్టేషన్‌లో వణుకుతూ, ఏడుస్తూ కిషోర్ నిలబడ్డాడు. మీటింగ్‌లో ఉన్నవాడు అక్కడికెలా వచ్చాడో తండ్రికి బోధపడలేదు. జరిగినదంతా సబ్‌ఇన్‌స్పెక్టర్ వివరించాడు. వీళ్ళిద్దరూ రాత్రివేళ వీధిలోని వారందరికి ఇబ్బందికరంగా కొట్లాడుకుంటూ న్యూసెన్స్ చేస్తుంటే గద్దించడానికి స్టేషన్‌కు తీసుకొచ్చాననీ, ఈ కాగితం మీద సంతకం పెట్టి పిల్లల్ని తీసుకు వెళ్ళిపోవచ్చని చెప్పాడు. కిషోర్ తండ్రి సంతకం పెట్టి కిషోర్‌ను ఇంటికి తీసుకువెళ్ళాడు. అసలు విషయమేమిటో, తండ్రికి అర్థమయింది. ఆయన కిషోర్‌తో మాట్లాడటం మానేశాడు.

తండ్రికి అవమానం తెచ్చే పని చేశానని కిషోర్ మనసు పశ్చాత్తాపంతో నిండిపోయింది.. తండ్రి మాట ధిక్కరించి వెళ్ళకూడని చోటికి వెళ్ళినందువల్లనే ఇంత రాద్ధాంతం జరిగిందని తండ్రి ముందు నిలబడి కన్నీళ్ళతో క్షమాపణ చెప్పుకున్నాడు. ఇక మీదట అలా ప్రవర్తించనని, మంచి పేరు తెచ్చుకుంటానని ప్రమాణం చేసి తండ్రి పాదాలపైబడ్డాడు. కిషోర్‌ని లేపి అక్కున చేర్చుకుంటూ, మరెప్పుడూ తప్పులు చేయకుండా మంచి మార్గాన నడవమని హెచ్చరించాడు తండ్రి.

చూశారా ! పిల్లలూ ! కిషోర్ తండ్రికి తెలియకుండా సినిమా చూసి వచ్చేద్దామనే రమేష్ ప్లాన్ బెడిసికొట్టింది. దుష్టుల ఆలోచన చొప్పున నడువక.... యెహోవా ధర్మశాస్త్రము నందు ఆనందించుచూ దివారాత్రములు దానిని ధ్యానించువాడు ధన్యుడు. అని బైబిల్ చెప్పుచున్నది. కిషోర్ వలె మీరు తల్లిదండ్రులకు ఏమీ తెలియకుండా చేయవద్దు. ప్రతీ స్థలంలో దేవుడు మిమ్ములను చూస్తున్నాడని భయపడి ప్రవర్తించండి. ఈ హాలిడేస్‌లో మంచి పిల్లలుగా పేరు తెచ్చుకుంటారుగా !

**– మీ అక్కయ్య**


**ఎపఫ్రా మినిస్ట్రీస్ – హైదరాబాద్‌లో**
**జరిగే ఆరాధన స్థలములు:**

1. భాగ్యలత కాలని, **వనస్థలిపురం**
2. హెచ్.యం.టి., **చింతల్**, జీడిమెట్ల
3. **అనాజ్‌పూర్,** రామోజీ ఫిల్మ్ సిటీ దగ్గర
4. అరుల్ కాలని, ఎ.ఎస్.రావు నగర్, **ఇ.సి.ఐ.ల్**

**వివరములకు :**
**సెల్ : 9666666249 | ఫోన్: 040-2420 2227**

# “నా జీవితములో దేవుని మేలులు”

- శ్రీను, ఘంటసాల

దేవునికి స్తోత్రములు

అయోగ్యుడను, అపాత్రుడను మరియు నామకార్థపు క్రైస్తవ జీవితము జీవిస్తున్న నన్ను మార్చిన ప్రభువును, రక్షకుడైన యేసుక్రీస్తు నామములో స్పర్శ పాఠకులందరికి నా హృదయపూర్వక వందనములు.


నా పేరు శ్రీనివాసరావు, మాది కృష్ణాజిల్లా, ఘంటసాల గ్రామము, విగ్రహారాధన కుటుంబము. అయితే నేను చిన్నప్పటి నుండి అమ్మమ్మ వాళ్ళ ఊరిలో పెరిగాను. క్రిస్మస్‌కి మాత్రమే చర్చికి వెళ్ళేవాడిని కానీ దేవుడిని ఆత్మతో సత్యముతో ఎలా ఆరాధించాలో తెలియదు. 10వ తరగతి తరువాత విజయవాడ ఐ.టి.ఐ కాలేజ్‌లో చేరాను. చదువుకునే రోజులలో సినిమాలు ఎక్కువగా చూసేవాడిని, విగ్రహాలకు నమస్కారం చేసేవాడిని. ఊరిలో ఇంటి దగ్గర ఉన్న రోజులలో అమ్మ వాళ్ళు చర్చికి రమ్మంటే ఏదో ఒక కారణం చెప్పి చర్చికి వెళ్ళే వాడిని కాను. 2003వ సంవత్సరము నాకు వివాహం జరిగింది. 2005వ సంవత్సరము ఉద్యోగము నిమిత్తము హైదరాబాద్ వచ్చాను. చింతల్ ఏరియాలో ఉంటూ ఒక ప్రైవేట్ కంపెనీలో వర్కర్‌గా జాబ్ చేస్తూ ఉండేవాడిని. నాతో పాటు మా మేనత్త వాళ్ళ అబ్బాయి ఆనంద్ ఉండేవాడు. ఇద్దరం ఒకే కంపెనీలో జాబ్ చేసేవాళ్ళము. నేను అలవాటుగా ప్రతి ఆదివారం వేరే చర్చికి వెళ్ళేవాడిని, ఖాళీ సమయములో సినిమాలకు కూడా వెళ్తూ ఉండేవాడిని.

ఈ విధంగా ఉంటూ ఉండగా ఒక ఆదివారం ఆనంద్ చింతల్‌లో ఒక ఇంట్లో ఆరాధన జరుగుతుంది అక్కడికి వెళ్దాం అని అన్నాడు. కాని నేను రాను అని చెప్పాను. మరల తరువాత ఆదివారం కూడా ఆరాధనకు చింతల్ వెళ్దాము అన్నాడు. అతని మాటని త్రోసి వేయడం ఇష్టం లేక ఆ రోజు సాయంత్రం ఆరాధనకు వెళ్ళాను. అదేరోజు ఆరాధనలో బ్రదర్ ఎపఫ్రా గారు వాక్యం బోధిస్తూ, సినిమాలు చూడడం ఎంత బలహీనమైనదో అనే విషయం మరియు నా పాపపు స్వభావం గురించి చెప్పడం జరిగింది.

ఆ రోజు వాక్యము నా గురించే చెప్పినట్లుగా అనిపించింది. ఆ రోజు నుండి ఆదివారం ఆరాధనలకు క్రమంగా వెళ్ళడం ప్రారంభించాను. అప్పటి వరకు నాలాంటి పాపిని దేవుడు క్షమించడు అనే అభద్రతా భావం మరియు అవిశ్వాసం కలిగిన హృదయముతో ఉండేవాడిని. రక్షణ అంటే మామూలు విషయం కాదు. రక్షణ తీసుకోవాలి

అంటే ఒక వ్యక్తికి ఎంతో అర్హత ఉండాలి, నాలాంటి పాపికి దేవుడు రక్షణ ఇస్తారా? అనే తలంపులతో ఉండేవాడిని. కాని మన ఎపఫ్రా మినిస్ట్రీస్‌లో దైవసేవకులు చెప్పే వాక్యమును శ్రద్ధగా విని, ఆ మాటలను అనుసరిస్తూ అనేక మంది యౌవనస్థులు, చిన్న వయస్సు వారు బాప్తిస్మం పొంది ఎంతో సంతోషంగా, సమాధానంగా ముందుకు కొనసాగుచున్న వారిని చూచి నా హృదయములో మార్పు కలిగింది. రక్షణ విషయంలో నేను ఆలోచించే ఆలోచన తప్పు అని తెలిసికొని, యేసుక్రీస్తు ఎలాంటి పాపినైన క్షమించి, రక్షించే దేవుడని విశ్వసించాను. డిసెంబర్ 31, 2005వ సంవత్సరం బాప్తిస్మము తీసికొన్నాను. తరువాత నా భార్య కూడా రక్షించబడింది. పరిచర్యలో ఉన్న దైవసేవకులు, సహోదరులు మరియు సహోదరీలు ప్రతి ఒక్కరి పట్ల చూపిస్తున్న ఎనలేని ప్రేమను బట్టి వందనములు, దేవునికి స్తోత్రములు. నా జీవితములో కొన్నిసార్లు ఆర్థికంగాను, ఆరోగ్యపరంగాను ఇబ్బందులు ఎదురైనప్పటికిని, కొన్ని సమయములలో ఆత్మీయంగా బలహీనమైనప్పటికిని, బ్రదర్ ద్వారా పరిశుద్ధాత్మ దేవుడు తన వాక్యముతో మాట్లాడి, ధైర్యపరిచి ఇబ్బందికరమైన పరిస్థితుల నుండి పైకి లేవనెత్తుతూ, హృదయములో నెమ్మది, శాంతి, సమాధానం అనుగ్రహిస్తూ, ఆత్మీయంగా బలపరుస్తూ ముందుకి నడిపిస్తున్నారు. అందును బట్టి దేవునికి స్తోత్రములు. నాకు ఇద్దరు బాబులు, నేను నా కుటుంబము ఎల్లప్పుడు దేవుని కృపలో నిలిచి ఉండాలని, చివరిశ్వాస వరకు దేవునికి నమ్మకమైన వారముగా జీవించాలని మా గురించి ప్రార్థన చేయమని వేడుకుంటున్నాను.

ఇంత గొప్ప పరిచర్యలో నన్ను, నా కుటుంబమును నిలిపి ఉంచిన దేవునికి స్తోత్రములు.



# మానసిక భావోద్రేకపరమైన స్వస్థతలు

భావోద్రేకములలో అవకతవకల వలన మానసిక ఒత్తిడుల వలన వచ్చే శారీరక అస్వస్థతలను గుర్తించి చికిత్స చేయడం ఈ మధ్య కాలంలో వైద్య విజ్ఞానములో కనిపించిన ఒక నూతన అధ్యాయం. ఇది ఊహించుకున్న అస్వస్థత కాదు. ఇది ఉన్న వ్యక్తి వాస్తవంగానే శారీరక అస్వస్థతా లక్షణముల మూలముగా బాధపడుచున్నాడు. నిజానికి ఆ శారీరక అస్వస్థత అతనికి లేదు గాని ఉన్నదనుకుంటున్నాడు. రోగి యొక్క సమస్య ముఖ్యంగా అతని మానసిక స్థితి మూలంగా కలిగింది.

సొలొమోను ఈ విషయమునే ఈ విధంగా ప్రస్తావించాడు. "మనిషి తన హృదయములో ఏది ఆలోచిస్తాడో అలానే ఉంటాడు" సామె 23:7. ఒక మనిషికి వ్యాధి అంటే తగని భయం అనుకోండి. జబ్బు చేస్తుందేమోనన్న ఒక రకమైన గుబులు అతని మనస్సును ఎప్పుడూ పీడిస్తూ ఉంటుందనుకోండి. అతడు ఏ జబ్బు గురించి భయపడుతున్నాడో అదే జబ్బును గురించిన ఆలోచనలు అతనిలో కలిగిస్తాయి. ఈ సంగతి యోబుకు బాగా తెలుసు. అతడు ఆరోగ్యముతో, సంపదలతో ఉన్నప్పుడు కూడా ఒకనాటికి వీటన్నిటిని కోల్పోవలసి వస్తుందేమోనన్న హానికరమైన తలంపులను మనస్సులో ఉంచుకుంటూ జీవించాడు. "ఇంత క్షేమ స్థితి కల కాలం కొనసాగుతుందా, ఇప్పుడు అంతా హాయిగా ఉంది. ఇది శాశ్వతంగా ఉంటుంది అనుకోరాదు" అని అనుకుంటూ ఉండవచ్చు. అతని ఆలోచనలు ఎలాంటివో గాని, అవి నిరాశాజనకంగా ఉండేవి అని అర్థమవుతున్నది. విచారం అతనిని కమ్ముకున్నది. తాను పుట్టక పోయినా బావుండేది అనిపించేటంత అతనికి జబ్బు చేసింది. అప్పుడు అతడు అంటున్నాడు "ఏది వచ్చునని నేను బహుగా భయపడితినో అదియే నాకు సంభవించుచున్నది. నాకు భీతి పుట్టించినదే నా మీదికి వచ్చుచున్నది. (యోబు 3:25)

తన ఆలోచనలను తాను ఏ భయములకైతే అప్పగించాడో అవే అతని జీవితములో ఆ భయములు నిజమయ్యేలా చేశాయి. "భయము దండనతో కూడినది" అని బైబిలు చెప్తున్నది (1 యోహాను 4:18). భయం నాశనకారి. మానసిక, శారీరక ఆరోగ్యములను రెండిటినీ అది ధ్వంసం చేస్తుంది. అందుకే యేసు హెచ్చరించాడు. "భయపడకుము, నమ్మికమాత్రముంచుము" (లూకా 8:50)

మనం సృష్టించబడినది విశ్వసించడానికే గాని భయపడేందుకు కాదు. విశ్వాసము మనలను బలపరచి దిట్టపరుస్తుంది. భయం బేజారెత్తించి కూలదోస్తుంది.

అదుపులేని భావోద్రేకములు :-

ప్రతికూలమైన భావోద్రేకముల (Negative thinking) ను అదుపులో ఉంచుకోకపోతే అవి ఆరోగ్యమును దెబ్బతీస్తాయి. చాలామంది క్రైస్తవులు తమ ఉద్రేకాలను

అదుపులో ఉంచుకోవలసింది పోయి వాటిని అనుసరించి ప్రవర్తిస్తూ ఉంటారు. తమకు ఏమి అనిపించిందో దానిపైన గుడ్డిగా ఆధారపడతారు, కొద్దిగా నిరాశ కలిగితే, ఆ నిరాశ తమను ఆక్రమించేలా అవకాశమిస్తారు.

ప్రతి చిన్న నిరాశా, ఆటంకమూ, ఎదురుదెబ్బా అలాంటి వారిని మరింత ఆగాధంలోనికి త్రోసివేస్తాయి. ఈ విధంగా మనోభావములపై అదుపు లేకపోవడం వారి ఆరోగ్యమును దెబ్బ తీస్తుంది. తీవ్రమైన వ్యాధి కలిగిస్తుంది. క్రైస్తవులు ఎన్నడూ తమ భావోద్రేకముల ప్రభావమునకు గురి కావడం దేవుని ఉద్దేశ్యం కాదు. వారు దేవుని వాక్యముపై తమ నమ్మకమును బట్టి తమ భావోద్రేకములను, ఊహలను, మనోభావములను ఏలవలసి ఉన్నది.

దేవుని వాక్యం ఆధారపడదగినది, మన భావోద్రేకములు చంచలమైనవి. మనం ఎడతెగక దేవుని వాక్యమును ధ్యానిస్తూ ఉన్నట్లయితే అది మన భావోద్రేకములను నిలకడపరుస్తుంది. వాక్యముతో నిండిన విశ్వాసి అటూ ఇటూ కొట్టుకుపోడు. వాక్యం ఎంత స్థిరమో అతడు అంతే స్థిరపడతాడు. మనస్సుకూ, హృదయమునకూ వాక్యమే బలమును, దృఢ నిశ్చయమును, స్థిరత్వమును సమకూరుస్తుంది. వైద్య విజ్ఞాన శాస్త్రవేత్తలు ఏమి చెప్తున్నారంటే శారీరక అస్వస్థతలు 30 శాతమునకు పైగా మనసులో లేక భావోద్రేకములలో పుడతాయి. అవేమిటంటే ఆందోళన, భయం, చింత, భద్రతారాహిత్యం, తనలో తాను కుమిలిపోవడం, మానసిక ఒత్తిడి, అసూయ, నిస్పృహ, కోపం, నైరాశ్యం ఇవన్నీ చాలా శక్తి కలిగిన నాశన హేతువులు. వీటిని విచ్చల విడిగా వదిలేస్తే ఆరోగ్యమును చించిపోగులు పెడతాయి.

అనేకమైన తీవ్రవ్యాధులకు పైన చెప్పినవి ముఖ్య కారణములు. రక్తపోటు, గుండెజబ్బులు, రక్త ప్రసరణ సంబంధమైన వ్యాధులు, ఉబ్బసం, కడుపులో పుండ్లు, తలనొప్పులు మొదలైన వ్యాధులు ప్రతికూలమైన మానసిక భావోద్రేక ప్రవృత్తుల వలన కలుగుతాయి.

ఎవరికైనా ఇలా మానసిక కారణముల వలన వ్యాధి వస్తే వారికి శారీరక స్వస్థత మాత్రమే కాక, అంతరంగంలో వారి మనస్సు మనోభావములు కూడా స్వస్థపడాలి. వ్యాధి లక్షణములను కుదర్చడం దేవునికి కష్టమైన పనేమి కాదు. అయితే మానసిక ప్రవృత్తిలో తీవ్రమైన మార్పు రాకుంటే ఆ వ్యక్తికి మరల అలాంటి వ్యాధే తిరగబెడుతుంది. ఉదాహరణకు దేవునికి కడుపులో అల్సర్‌ను బాగుచేయడం బహు తేలిక. అయితే ఆ మనిషికి ఆ అల్సర్ వచ్చేలా చేసిన అంతరంగములోని మనోభావముల నుండి అతడు బయటపడగలగడం కష్టం. ఒక మనిషి పెద్ద మానసిక ఒత్తిడిని, ఆందోళనను, చింతను ఇలాగే మోస్తూ ఉంటాను అని అంటే ఆ విషయములు త్వరలోనే మరియొక అల్సర్‌ను అతనిలో సృష్టిస్తాయి.

ఇలాంటి దీర్ఘ వ్యాధులు నయం కావడానికి దావీదు చక్కటి నివారణోపాయమును చెప్పాడు.

# ప్రార్థన - ఊపిరిపీల్చుట వంటిదే

## మనస్సుతో ప్రార్థించుట

"కాబట్టి ఆత్మతో ప్రార్థన చేతును, మనస్సుతోను ప్రార్థన చేతును, ఆత్మతో పాడుదును, మనస్సుతోను పాడుదును" అని 1 కొరింథి 14:15లో అపో.పౌలు చెప్పిన విధంగా మనకి ఏదైనా అవసరత వచ్చినప్పుడు లేక ఏ విషయమైనా ప్రార్థించాలని తలచినప్పుడు మనము వెంటనే మన మనస్సులలో మనకి ఏమి తెలుసో దాని ఆధారంగా ప్రార్థించుట ప్రారంభించి, మన ఆత్మ మనము ప్రార్థిస్తున్న దిశను అంగీకరిస్తుందో లేదో వేచి చూడాలి.

ప్రార్థనలో ప్రతీసారి ప్రార్థించుటకు ముందు దేవుని భారము మనపై వచ్చు వరకు వేచి వుండవలసిన అవసరం లేదు కానీ మన మనస్సులో ప్రారంభించి, ఆత్మ సహాయపడుతుందో లేదో అని వెదకవచ్చు. మనం ఎల్లప్పుడూ ఆత్మ యొక్క ప్రవాహమును, క్షీణతను అర్థం చేసుకొనలేము, కొన్ని సమయములలో పరిశుద్ధాత్మ సమృద్ధిగా ఉండి మనం ఒక మార్గములో బలంగా నడిపించబడుతున్నట్లు భావిస్తాము. అయితే కొన్ని సమయములలో ఆయన పూర్తిగా మౌనంగా ఉన్నాడని మనం ఒప్పుకొనవలసి ఉంటుంది. ఆ సమయములలో మన మనస్సులలోని జ్ఞానమును అనుసరించి ప్రార్థించవలసి ఉంటుంది.

మనకు తెలిసిన ఒక అవసరత గురించి ప్రార్థించుట మొదలు పెట్టినప్పుడు త్వరలోనే అది దేవుని చిత్తమైనదో కాదో కనుగొంటాము. మనం ఆ పరిస్థితిని గురించి ప్రార్థన చేయాలనుకున్నాము గనుక దాని మనం ఆత్మీయంగా చేయవలసి ఉన్నది. మాటల కొరకు ఇబ్బంది పడకుండా ప్రార్థనలో ఒక గొప్ప ప్రవాహమును చూస్తాము. ఆత్మీయత ద్వారా ఇబ్బందులలో నుండి పైకి రావాలని గ్రహించుట ఎందుకుంటే మనము పరిస్థితిని గురించి ప్రార్థిస్తున్నాము అని అనుకుంటున్నాము కాబట్టి ఆత్మలో ప్రార్థించుట అంటే ఆయన లేకుండా ప్రార్థించలేమని నిశ్చయించుకోవాలని అర్థము. మనం స్వంతగా ప్రారంభించినప్పటికీ, పరిశుద్ధాత్మ తన అంగీకారమును, దైవికబలమును ఇచ్చే వరకు మనం ఏమీ చేయలేము.

## ప్రార్థనలో వ్యతిరేకత

ప్రార్థనలో పరిశుద్ధాత్ముని అనుసరించుటకు వెదకుచున్నప్పుడు మనం ఆటంకములను ఎదుర్కొంటాము. ఈ ఆటంకం భయం రూపంలో వస్తుంది. సహజ ఆపదలు, భయంకరమైన రోగం లేక కొన్ని ఇతర మహా విపత్తులు - కాని మామూలుగా విశ్రాంతి లేకపోవడం మరియు మనస్తాపము అనే సామాన్యమైన విషయములు కూడా ధైర్యంగా ప్రార్థించనీయకుండా భయపడేటట్లు చేయడానికి సాతాను ప్రయత్నిస్తాడు. విశ్వాసంతో

కాకుండా భయముతో దేవుని దగ్గరకు చేరునట్లుగా చేస్తాడు. వాడు మన పాపములు, తప్పిదములు మనకు జ్ఞాపకం చేసి, దేవుని ఎక్కువగా అడిగే హక్కు మనకు లేదేమో అని భావించే విధంగా చేస్తాడు. ఆయన సింహాసనం వద్దకు “ధైర్యంగా రమ్మని” బైబిలు మనకు బోధిస్తుంది (ఎఫెసీ 3:12, హెబ్రీ 4:16)

కొంతమంది నిరంతరం చిన్న చిన్న భయముల క్రింద బ్రతుకుతూ ఉంటారు. ప్రతిదినం వచ్చే భయముల చాలా చిన్నవి, కాని అవి మనుష్యుల దృష్టిని తమపై కేంద్రీకరించునట్లు చేసి వారి ప్రార్థనా జీవితమునకు ఆటంకములవుతాయి. ఇలాంటి చిన్న విషయములను ఎత్తి చూపుటకు సాతానుని రానీయుటకు బదులుగా మనము దేవుని నమ్మి ప్రార్థించాలి. మన జీవితములు అల్పమైనవి, భయముతో కూడుకున్నవి, భయముతో కొనసాగేవి కాబట్టి మన దయనొందిన జీవితములలోని భయముతో కూడిన ఆలోచనలు మరియు సంభాషణలను చిన్న సులువైన ప్రార్థనతో నింపవలసియున్నది. “ప్రతిదాని గురించి ప్రార్థించు, దేనికీ భయపడకు” అని మన ప్రార్థనా జీవిత విధానమును అభివృద్ధి చేసుకుంటున్నప్పుడు ప్రార్థనకు బలమును ఇవ్వని ప్రతి అలవాటును ఆలోచనా విధానమును నశింపచేయవలసి ఉన్నది.

పరిశుద్ధాత్మ ఆ విషయములో మనకు సహాయం చేస్తాడు. కాబట్టి వ్యతిరేక అలవాట్లు నుండి దినమంతా దేవుని యందలి విశ్వాసం ద్వారా, దేవునితో కలిసి ఉండే ప్రార్థనలోకి మనలను నడిపించమని ఆయనను అడగాలి. అప్పుడు ఊపిరి పీల్చుట వలే, ప్రార్థన మనకి సుళువు అవుతుంది.

1. నీకు ఏదైనా సమస్య వచ్చినప్పుడు ప్రార్థించు
2. నీకు ఏదైనా అవసరం వచ్చినప్పుడు, ప్రార్థించు
3. నీ భావములను ఎవరైనా బాధపెట్టినప్పుడు, ప్రార్థించు
4. నీకు హాని జరిగినప్పుడు, ప్రార్థించు
5. నీవు రోగివైనప్పుడు, ప్రార్థించు
6. నీవు పూర్తిగా నిస్సహాయుడివైనప్పుడు, ప్రార్థించు
7. నీవు ప్రేమించువారు బాధపడుతున్నప్పుడు, ప్రార్థించు
8. నీవు నిరాశ చెందినప్పుడు, ప్రార్థించు
9. నీవు ఏమి చేయాలో నీకు తెలియనప్పుడు, ప్రార్థించు

**(ఇంకా ఉంది) - సేకరించబడినది**




# నదులు

**కానా నది :** ఈ నది ఎఫ్రాయిము మరియు మనష్షే గోత్రీకులకు మధ్య సరిహద్దు.

**కీషోను నది** (వంకర టింకరగా ఉండు)

కర్మెలు కొండకు ఈశాన్యముగా ప్రవహించు ఒక నది, తూర్పున ఉన్న తాబోరు కొండలలో పుట్టి, యెజ్రెయేలు మైదానము మీద వాగుగా ప్రవహించును. కర్మెలు కొండ మీద నుండి ప్రవహించు అనేకమైన చిన్న వాగులు అందులో కలియుట వలన అది ఏరుగా కర్మెలు కొండ అడుగు పొడుగున ప్రవహించి అక్కో అను పట్టణము దగ్గర మధ్యధరా సముద్రములో కలియును. తాబోరు నుండి కర్మెలు వరకు ఇది వర్షాకాలములో మాత్రమే ప్రవహించును గాని అది మొదలు సంవత్సరమంతా ప్రవహించే మంచి నదిగా ఉన్నది. ఆ నదిని గూర్చి మొదట న్యాయాధిపతుల గ్రంథములో చెప్పబడినది. ప్రవక్తయగు దెబోరా, న్యాయాధిపతియగు బారాకును, రాజైన యాబీను, సేనానియగు సీసెరా మీద దేవుని ప్రేరేపణ వలన యుద్ధము చేసినప్పుడు అతడు తన రథములతోను, కాల్బలముతోను కీషోను నదిని దాటుచుండగా దేవుని ఆజ్ఞ వలన ఆ నదిలో అకస్మాత్తుగా ఒక ప్రవాహము పుట్టి వారి మీద ప్రవహించినందున వారందరు నాశనమయ్యిరి.

తరువాత ఇంచుమించుగా 300 సంవత్సరములు అయిన తరువాత రాజైన ఆహాబు అతని దుష్ట భార్యయగు యెజెబెలు అను ఇరువురి వలన ఇశ్రాయేలు జనులు ప్రేరేపితులై, యెహోవాను విడిచి బయలు అను సీదోనీయుల దేవత తట్టు త్రిప్పబడినందుకు శిక్షగా మూడేండ్లు కరువు కలిగెను. అప్పుడు యెహోవా ఆజ్ఞ వలన ఏలియా ఆహాబును, ఇశ్రాయేలీయులను, బయలు ప్రవక్తలనందరిని కర్మెలు కొండ మీద ప్రోగుచేసి, తాను అర్పించవలసిన బలిని దహించుటకు ఆకాశము నుండి వచ్చిన అగ్నిని బట్టి యెహోవాయే దేవుడని జనులందరును ఒప్పుకొనునట్లు చేసి, బయలు ప్రవక్తల నందరిని పట్టుకొని, కర్మెలు కొండ అంచున ఉండిన ఈ కీషోను నది ఒడ్డున చంపివేసెను. అప్పుడు మంచి వర్షము కురిసెను, కరువు తీరిపోయెను.




# బైబిల్ క్విజ్ -22

(తీతు, ఫిలేమోను పత్రికలు)

ఈ క్రింది ప్రశ్నలకు సరైన జవాబులు వ్రాయండి

**1.** **శీతాకాలమును ఎక్కడ గడపాలని పౌలు నిర్ణయించుకున్నాడు?**
**2.** **సోమరులైన తిండిపోతులెవరు?**
**3.** **బంధకములలో ఉన్నప్పుడు పౌలు విశ్వాసంలో కనిన కుమారుడు ఎవరు?**
**4.** **నిన్ను నీవే సత్కార్యముల విషయమై మాదిరిగా కనుపరచుకొనుమని ఎవరు ఎవరితో అన్నారు?**
**5.** **ఫిలేమోనుకు ఈ పత్రికను వ్రాసింది ఎవరు?**
**6.** **అతడు మునుపు నీకు నిష్ప్రయోజనమైనవాడేగాని, యిప్పుడు నీకును నాకును ప్రయోజనకరమైన వాడాయెను. అతడు ఎవరు ?**
**7.** **పౌలు యొక్క తోడి ఖైది ఎవరు?**
**8.** **తీతు పత్రికలో ప్రస్తావించబడిన ధర్మశాస్త్రవేది ఎవరు?**
**9.** **క్రీస్తునందు తన హృదయానికి విశ్రాంతి కలుగజేయుమని పౌలు ఎవరికి చెప్పాడు?**
**10.** **క్రేతు సంఘంలో లోపముగా ఉన్నవాటిని సరిదిద్దడానికి పౌలు ఎవరిని నియమించాడు?**

ఈ ప్రశ్నలకు సరైన సమాధానములు జూన్ 15వ తేదీ లోపు మాకు వ్రాసి పంపించండి. సరైన సమాధానములు వ్రాసిన వారి పేర్లు జూలై 2012 పత్రికలో ప్రచురించబడతాయి.

**పంపవలసిన చిరునామా - ఎడిటర్ - స్పర్శ,** ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070

**బైబిల్ క్విజ్ - 21 జవాబులు**

1. ధనాపేక్ష (1 తిమోతి 6:10)
2. త్రోఫిము (2 తిమోతి 4:20)
3. యూనీకే (2 తిమోతి 1:5)
4. దేమా (2 తిమోతి 4:10)
5. కర్పు (2 తిమోతి 4:12,13)
6. థెస్సలొనీకయ సంఘంలో (1 థెస్స 2:9)
7. క్రీస్తునందుండి మృతులైనవారు (1 థెస్స 4:16)
8. తిమోతి (1 తిమోతి 1:18)
9. తిమోతిని (1 తిమోతి 6:11)
10. పౌలు ( 1 తిమోతి 2:7)

**బైబిల్ క్విజ్-21, సరైన సమాధానములు వ్రాసిన వారి పేర్లు :-**

సౌజన్య, హేమలత, కొర్నేలీ, విజయ, రాజ్‌కుమార్, సరస్వతి, రాజ్యం, రూప, హనోకు

# జన్మదిన శుభాకాంక్షలు

క్రీస్తునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.
తండ్రియైన దేవుని నుండి కృపయు, సమాధానము మీకు కలుగును గాక !
ఈ పత్రిక ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

**" నీ దేవుడైన యెహోవా కన్నులు సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు ఎల్లప్పుడు మీ జీవితముల మీద ఉండును గాక ! "**

## మే - జూన్

**భాగ్యలత :** మణి, శిరీష, మేరీరత్నం, జ్యోతి, వెంకటేష్, మల్లిక, హారిక, రోషిణి, శారా, మాధురి, సుధ, రూతు, శేఖర్‌బాబు, రఫీ, మేరీఫాతిమా, జాన్, పాల్‌రాజ్, వీరలింగం, నవ్య, జయరాజు, ఫిలిప్పు, మన్యం, లక్ష్మీ, నవీన, రూతు, విజయ, జ్యోతి, లత, నాగరాజు, కృష్ణకళ్యాణ్, ప్రియాంక, వినయ్‌కుమార్, నాగరాజు, నవీన్, అనిల్‌కుమార్, మధుబాల, ప్రశంస, ప్రశాంతి, గీతాసాత్విక, ఆనందప్రసాద్, మణికాంత్‌రెడ్డి, కృపాజ్యోతి, శారమ్మ, మమత,శేఖర్ (సింగపూర్).

**చింతల్ :** విజయ, సాత్విక్, శామ్సన్, సాల్మన్‌రాజు, జీవా, రమ్య, శ్రీనివాసరావు, జగన్‌మోహన్‌రావు, అనూష, లత, గోపిచంద్, ఐజాక్‌కుమారి, వెన్నెల, నిహారిక, రవీందర్, జాన్సన్, సురేష్‌బాబు, స్వర్ణలత, మల్లేశ్వరి, సంధ్యారాణి, ప్రజ్ఞ, సునీత, ఆనంద్‌కుమార్, బాబూరావు,అభిషేక్,మరియ,బెంజిమన్, రాధాకృష్ణ, దేవకిరణ్, విజయమ్మ, సురేంద్ర, ఎలిజబెత్ రాణి, వివేకవతి, నిర్మల, ప్రశస్త, ఎస్తేరురాణి, రూతమ్మ, జీవమణి, జగన్, విజయ్, కృపారాణి.

**అనాజ్‌పూర్ :** జీవన్‌కుమార్, మృణాళిని, మహాలక్ష్మి, ఆంద్రెయ, జాషువా, నరసింహ, రాజ్‌కుమార్, రత్నాకర్, కారుణ్య, సుజిత్‌కుమార్, బ్లెస్సీ, మరియమ్మ

**ఇ.సి.ఐ.యల్ :** విజయ్‌కుమార్, ఆనంద్, వివేక్.

**'స్పర్శ'** అనే మన ద్విమాస పత్రిక ప్రతి విడి పత్రిక రూ.10/–లు, సంవత్సర చందా రూ. 50/–లు, జీవితకాల చందా రూ. 1000/–లు మరియు విదేశములకు సంవత్సరమునకు **US $ 20.**

చందాదారులు కావలసిన వారు **ఎపఫ్రా మినిస్ట్రీస్ ట్రస్ట్, హైదరాబాద్** (Epaphras Ministries Trust, Hyderabad) పేరున **డి.డి/మనిఆర్డర్** తో పాటు మీ పూర్తి వివరములు ఈ ఫారములో నింపి మా చిరునామాకు పంపించగలరు.

1. పూర్తి పేరు: ____________________

2. చిరునామా: ____________________

____________________

____________________

పిన్ కోడ్: ____________________

**మీ ప్రార్థనావసరతలు:**

____________________

____________________

____________________

____________________


మా చిరునామా:
**ఎపఫ్రా మినిస్ట్రీస్,** ప్లాట్ నెం. 1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా,
భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్–70, ఫోన్: 040–2420 2227




**ఎపఫ్రా గాస్పెల్ చర్చ్**

భాగ్యలతకాలని,
వనస్థలిపురం నందు
జరిగిన గుడ్‌ఫ్రైడే మరియు
ఈస్టర్ ఆరాధనలలో
అనేకులు పాల్గొని
దేవునిని ఆరాధిచడటం
జరిగినది.





ఏప్రిల్ 23,24-2012 వ తేదీలలో, ఎపఫ్రా మినిస్ట్రీస్ అబ్దుల్లాపూర్ మెట్‌లో
ఏర్పాటు చేయబడిన సువార్త సభలలో దేవునిని ఆరాధిస్తున్న దృశ్యాలు





మే 1, 2012 మంగళవారం, హయత్‌నగర్-హైదరాబాద్
వర్డ్ అండ్ డీడ్ స్కూల్ ఆడిటోరియం నందు జరిగిన ఉపవాస ప్రార్థనలో
అనేకులు పాల్గొని దేవునిని ప్రార్థించుట జరిగినది.





# ఎపఫ్రా మినిస్ట్రీస్

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070
Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com | web: www.epaphra.org